క్లుప్తంగా

28న పెన్షన్ల పరిశీలన

పీసీపల్లి: హెల్త్ పెన్షన్లు తీసుకుంటున్న 18 మంది లబ్ధిదారులకు ఈనెల 28వ తేదీన వైద్య బృందం పరిశీలిస్తుందని ఎంపీడీవో ప్రభాకర్ శర్మ ప్రకటనలో తెలిపారు. వీరందరూ కూడా అందుబాటులో ఉండి వైద్య బృందం ద్వారా ఆరోగ్య పరీక్షలు చేయించుకుని సదరం సర్టిఫికెట్ పరిశీలించుకోవాలని ఆయన తెలిపారు. అందుబాటులో లేనివారి పింఛన్లు నిలిపివేస్తామని, అందరూ అందుబాటులో ఉండాలని ఆయన ప్రకటనలో కోరారు.

28 నుంచి ఉచిత శిక్షణ ప్రారంభం

కొండపి: ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల ట్రైనింగ్ సెంటర్‌లో ఈనెల 28 నుంచి ఉచిత శిక్షణ శిబిరం ప్రారంభమవుతుందని స్కిల్ హబ్ కో ఆర్డినేటర్ గోపికృష్ణ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. స్కిల్ హబ్ సెంటర్‌లో డొమెస్టిక్ ఐటీ హెల్ప్ డెస్క్ అటెండెన్స్ కోర్స్, టైలరింగ్‌పై మూడు నెలల పాటు శిక్షణ తరగతులు ఇస్తున్నామని ఆయన తెలిపారు. రిజిస్ట్రేషన్ చేసుకోవడానికి ఆఖరి తేదీ 27 అని తెలిపారు. రిజిస్ట్రేషన్ చేసుకున్న వారికి 28వ తేదీ నుంచి శిక్షణ తరగతులు ప్రారంభిస్తున్నామని తెలిపారు. శిక్షణ పూర్తి చేసుకున్న తర్వాత ఉద్యోగ అవకాశాలు కల్పిస్తామన్నారు. ఆసక్తి కలిగిన యువతీ, యువకులు అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని, వివరాలకు 88979 64505 సంప్రదించాలని ప్రకటనలో ఆయన కోరారు.

వార్డుల్లో పర్యటించిన చైర్మన్



వార్డులో సమస్యలు తెలుసుకుంటున్న చైర్మన్ గఫార్

కనిగిరి రూరల్: సీజనల్ వ్యాధుల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని మున్సిపల్ చైర్మన్ ఎస్‌కే అబ్దుల్ గఫార్ అన్నారు. పట్టణంలోని పలు వార్డుల్లో గురువారం ఆయన పర్యటించారు. ఈ సందర్భంగా స్థానికులు పలు సమస్యలను చైర్మన్‌కు విన్నవించారు. అనంతరం చైర్మన్ గఫార్ మాట్లాడుతూ ప్రతి ఒక్కరు పరిసరాల, వ్యక్తిగత పరిశుభ్రతలను పాటించాలన్నారు. వార్డుల్లో పారిశుద్ధ్య చర్యలు చేపట్టాలని సిబ్బందిని ఆదేశించారు. కార్యక్రమంలో శిగా కృష్ణారావు, మున్సిపల్, సచివాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

26న మాంస విక్రయాలు చేయరాదు

కనిగిరి రూరల్: గణతంత్ర్య దినోత్సవం పురస్కరించుకుని ఈనెల 26న ఆదివారం ప్రభుత్వ ఉత్తర్వు ప్రకారం పట్టణంలో ఎటువంటి మాంసహార విక్రయాలు జరుపకూడదని మున్సిపల్ కమిషనర్ డానియల్ జోసఫ్ ఒక ప్రకటనలో తెలిపారు. జంతువధ శాలలు, మాంసం, చేపల వ్యాపారులు, చికెన్ అంగళ్లు అన్ని ఆదివారం మూసివేయాలన్నారు. హోటళ్లు, రెస్టారెంట్‌లలో కూడా మాంసాహారాలు విక్రయించరాదన్నారు. నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరిస్తే వారిపై చట్టరీత్యా చర్యలు తీసుకుంటామని ఆయన హెచ్చరించారు.

పశువైద్య శిబిరాలతో ఉపయోగాలు



పశువులకు పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యుడు

సింగరాయకొండ: గ్రామాల్లో ముందస్తు ప్రణాళిక ప్రకారం పశువైద్య శిబిరాలు నిర్వహిస్తున్నామని.. పశుపోషకులు అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని మండల పశువైద్యాధికారి ఎస్ హజరత్ విజ్ఞప్తి చేశారు. మండలంలోని సోమరాజుపల్లి పంచాయతీలోని రైతు సహాయ కేంద్రం వద్ద గురువారం నిర్వహించిన పశువైద్య శిబిరంలో ఆమె పాల్గొన్నారు. ఈ సందర్భంగా పశువులకు నట్టల నివారణ మందు తాగించారు. ఎదకు రాని, తిరగకట్టు పశువులను పరిశీలించి మందులు ఇచ్చారు. ఈ గ్రామాలలో మొత్తం 149 మంది పశుపోషకులకు మందులు ఉచితంగా అందజేశారు. పంచాయతీ కార్యదర్శి శ్రీనివాసరావు, సిబ్బంది, పశుపోషకులు పాల్గొన్నారు.

తవ్వుకో.. అమ్ముకో !

- ఊరచెరువులో గ్రావెల్ అక్రమ తవ్వకాలు
- రోజుకు 70–80 ట్రాక్టర్ల తరలింపు
- పట్టించుకోని అధికారులు
- ప్రభుత్వ ఖజానాకు గండి



అక్రమంగా గ్రావెల్ తరలిస్తున్న ట్రాక్టర్లు

సింగరాయకొండ:

కూటమి అధికారంలోకి వచ్చిన మరుసటి రోజు నుంచి నేటి వరకు ఎక్కడ ఇసుక, గ్రావెల్ కనపడినా చాలు అలా అమ్ముకొని.. ఇలా జేబులు నింపుకుంటున్నారు. మద్యం మాఫియా, ఇసుక, మట్టి, గ్రావెల్ తవ్వకాల్లో ఆరితేరిపోయారు తెలుగు తమ్ముళ్లు. అధికారం మాదే కదా మమ్మల్ని అడిగేవారేవరూ ? అంటూ అందిన కాడికి దండుకుంటున్నారు. మండలంలోని పాత సింగరాయకొండ పంచాయతీ ఊరచెరువులో అక్రమ గ్రావెల్ తవ్వకాలు యథేచ్ఛగా జరుగుతున్నా ఇరిగేషన్, రెవెన్యూ, పంచాయతీ, పోలీసు అధికారులు పట్టినట్లుగా వ్యవహరిస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఊరచెరువులో గత కొన్ని రోజులుగా ప్రతిరోజూ భారీగా ట్రాక్టర్ల ద్వారా గ్రావెల్ అక్రమ రవాణా జరుగుతోంది. అధికారులు మాత్రం ఆ ఛాయలకు కూడా రావడం లేదని ప్రజలు ఆరోపిస్తున్నారు. ఈవిషయమై ఇరిగేషన్, మైనింగ్ అధికారులకు ఫిర్యాదు చేసినా అవునా.. ! తవ్వుతున్నారా మా సిబ్బందిని పంపిస్తాం.. అని దాటవేసే మాటలు చెప్తున్నారే కాని ఏఒక్క అధికారి కూడా వారిని అడ్డుకున్న దాఖలాలు లేవన్నారు. ఈ తతంగం మూడు రోజుల క్రితం నుంచి జరుగుతోంది. ప్రతి రోజూ 70 నుంచి 80 ట్రాక్టర్ల ద్వారా గ్రావెల్ తవ్వకొని ఇష్టారీతిన అమ్ముకుంటున్నారు. ఒక్కో ట్రాక్టర్ రూ.800–1000 దాకా అమ్ముకుంటున్నారంటే అర్థం చేసుకోవచ్చు.



జేసీబీతో గ్రావెల్ తవ్వకాలు జరుపుతున్న జేసీబీ

తెలుగు తమ్ముళ్ల దందా..

గ్రావెల్ అక్రమ రవాణాలో తెలుగు తమ్ముళ్లు ప్రాతినిధ్యం వహిస్తుండటంతో అధికారులు ఆ పక్కకు రావాలంటే భయపడుతున్నారు. ఒకవేళ ఏ అధికారైనా వారిని ఆపే సాహసం చేస్తే మండలంలో పని చేయాలని ఉందా లేదా అని బెదిరింపులకు గురి చేస్తున్నారు. దీంతో వారు ఏం చేయాలో అర్థం కాక వెనుదిరుగుతున్నారని గ్రామస్తులు ఆందోళన వ్యక్తం చేశారు. గత ప్రభుత్వంలో ఇంటి అవసరాలకు తోలుకున్నా టీడీపీ నాయకులు రాద్ధాంతం చేసేవారని, దోపిడీ జరుగుతుందని మాట్లాడేవారని అప్పుడు దోపిడీ ఈ రోజు ఏమైందని ప్రజలు ప్రశ్నిస్తున్నారు. దీనికి తోడు జనసేన నాయకులు అక్రమంగా ఎక్కడ జరిగినా సమాచారం ఇస్తే వెంటనే స్పందిస్తామని సోషల్ మీడియా ద్వారా ప్రకటనలు చేస్తున్నారు. అధికారులు స్పందించకపోతే జనసేన నాయకులను ఆశ్రయిస్తామని ప్రజలు తెలియజేస్తున్నారు. అయితే అధికారులు మాత్రం మామూళ్ల మత్తులో పట్టిపట్టనట్లు వ్యవహరిస్తున్నారు. విలువైన సంపద తరలిపోయి సీనరేజ్ రూపంలో ప్రభుత్వానికి నష్టం వస్తున్నప్పటికి చోద్యం చూడటంపై ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

వైఎస్సార్ సీపీలో పలువురికి పదవులు

కనిగిరి రూరల్: వైఎస్సార్ సీపీ రాష్ట్ర అధ్యక్షుడు, మాజీ సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు పార్టీ కనిగిరి నియోజకవర్గ వివిధ విభాగల అనుబంధ సంఘాల అధ్యక్షులను నియమించారు. ఈమేరకు జాబితాను విడుదలను చేశారు. యూత్ విభాగం అధ్యక్షుడిగా వాకుమళ్ల రాజశేఖరరెడ్డి, మహిళా విభాగం అధ్యక్షురాలిగా పులి శాంతి (మున్సిపల్ వైస్ చైర్మన్), రైతు విభాగం అధ్యక్షుడిగా పోలక వెంకటేశ్వర్లు (సిద్ధారెడ్డి), బీసీ సెల్ అధ్యక్షుడిగా బత్తుల దేవరాజ్, ఎస్సీసెల్ అధ్యక్షుడిగా గూడూరి అనీల్‌బాబు, ఎస్టీ సెల్ అధ్యక్షుడిగా శ్రీరామ శ్రీనివాసులు, మైనార్టీ సెల్ అధ్యక్షుడిగా ఎస్‌కే గయాజ్, క్రిస్టియన్ మైనార్టీ సెల్ అధ్యక్షుడిగా గూడూరి అబ్రహం లింకన్, విద్యార్థి విభాగం అధ్యక్షుడిగా సంగటి మహేంద్రారెడ్డి, పంచాయతిరాజ్ విభాగం అధ్యక్షునిగా సానికొమ్ము మధుసూదన్‌రెడ్డి, మున్సిపల్ విభాగం అధ్యక్షుడిగా సిరుప వెంకట గోవర్ధన్‌రెడ్డి, ఆర్టీఐ విభాగం అధ్యక్షుడిగా తూము వెంకట కృష్ణారెడ్డి, వలంటీర్ విభాగం అధ్యక్షుడిగా చేకూరి అనీల్, గ్రీవెన్స్ సెల్ విభాగం అధ్యక్షుడిగా కాకర్ల వెంకటేశ్వర్లు, వాణిజ్య విభాగం అధ్యక్షుడిగా తడికమళ్ల వెంకటేశ్వర్లు, వీవర్స్ విభాగం అధ్యక్షుడిగా శిగా కృష్ణారావు, వైఎస్సార్ టీయూసీ విభాగం అధ్యక్షుడిగా యర్రం రెడ్డి నాగ మోహన్‌రెడ్డి, అంగన్‌వాడీ విభాగం అధ్యక్షురాలిగా అలిముళ్ల నాగమణి, లీగల్ సెల్ అధ్యక్షుడిగా అచ్చాల ఆది నర్సారెడ్డి, కల్చరల్ విభాగం అధ్యక్షుడిగా పల్నాటి భాస్కర్‌రెడ్డి, సోషల్ మీడియా విభాగం అధ్యక్షుడిగా మర్రి రాజు, ఐటీ విభాగం అధ్యక్షుడిగా లింగాల దిన్నె మాల్యాద్రి లక్ష్మీ నరసింహారెడ్డి, దివ్యాంగుల విభాగం అధ్యక్షుడిగా గవిరెడ్డి రమణారెడ్డి, వైద్య విభాగం అధ్యక్షుడిగా ఆవుల కృష్ణారెడ్డి, ఇంటలెక్చువల్ ఫాం విభాగం అధ్యక్షుడిగా పరిమి వెంకటరావ్ చౌదరి, బూత్ కమిటీ విభాగం అధ్యక్షుడిగా కస్తాల బాలయ్య, పబ్లిసిటీ విభాగం అధ్యక్షుడిగా దాదిరెడ్డి మాలకొండారెడ్డిలను నియమించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తమపై ఎంతో నమ్మకంతో వైఎస్సార్ సీపీ లో కీలక బాధ్యతలు అప్పగించిన పార్టీ అధినేత వైఎస్ జగన్ మోహన్‌రెడ్డికి, రాజ్యసభ సభ్యుడు వైవీ సుబ్బారెడ్డికి, పార్టీ జిల్లా అధ్యక్షుడు బూచేపల్లి శివ ప్రసాద్‌రెడ్డికి, పార్టీ ఒంగోలు పార్లమెంటరీ ఇన్‌చార్జి చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డికి, పార్టీ రీజనల్ కోఆర్డినేటర్ కారుమూరి వెంకట నాగేశ్వరరావుకు, పార్టీ కనిగిరి నియోజకవర్గ ఇన్‌చార్జి డాక్టర్ దద్దాల నారాయణ యాదవ్‌లకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

విద్యార్థులకు పరీక్ష సామగ్రి అందజేత



పరీక్ష సామగ్రి అందజేస్తున్న ఎస్‌ఓ, దాత

పామూరు: మండల కేంద్రమైన పామూరు కేజీబీవీలో 10వ తరగతి, ఇంటర్మీడియట్ చదువుతూ వార్షిక పరీక్షలకు హాజరుకానున్న విద్యార్థినులకు దాతలు పరీక్ష సామగ్రి పంపిణీ చేశారు. ఈసందర్భంగా గురువారం కేజీబీవీలో ఎస్‌ఓ కటకం సజన అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో దాత రెడ్డి సంక్షేమ సంఘం నాయకులు, సింగిల్ విండో మాజీ ఛైర్మన్ బైరెడ్డి జయరామిరెడ్డి కుర్చీలు, పోకా నాయుడు పరీక్ష సామగ్రి, మరికొన్ని మొత్తం 78 మందికి ఎస్‌ఓతో కలిసి విద్యార్థులకు అందజేశారు. విద్యార్థులందరూ క్రమశిక్షణతో మెలగాల్నారు. అప్పుడే జీవితంలో ఉన్నతస్థానంలో ఉంటారని ఆయన దాతలు సూచించారు. కార్యక్రమంలో ఏవో వాణి, మండ్లా శైలజ, జయలక్ష్మి, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

గ్రంథాలయంలో వసతులు కల్పించాలి



పీసీపల్లిలో గ్రంథాలయ కార్యదర్శి ఆదిలక్ష్మికి ఫిర్యాదు చేస్తున్న ప్రజలు

పీసీపల్లి: ప్రతిరోజు గ్రంథాలయం తెరవాలని గ్రంథాలయ సంస్థ జిల్లా కార్యదర్శి కాసు ఆదిలక్ష్మి అన్నారు. గురువారం పీసీపల్లి వైఎస్సార్ సెంటర్‌లో ఉన్న తాత్కాలిక గ్రంథాలయాన్ని ఆమె తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆదిలక్ష్మి మాట్లాడుతూ ప్రజలకు జ్ఞానాన్ని ఇచ్చే గ్రంథాలయాన్ని అన్ని వసతులు సమకూర్చి అందుబాటులో ఉంచాలన్నారు. గ్రంథాలయం సరిగ్గా తీయడం లేదని, శాశ్వత లైబ్రేరియన్, పుస్తకాలు ఎక్కువగా ఏర్పాటు చేయాలని మురుగమ్మి సర్పంచ్ ఎస్ శ్రీనివాస్‌యాదవ్ , కొత్తపల్లి అంకమ్మ, గోపవరపు బిల్లా రెడ్డి, ఫిర్యాదు చేశారు.

టంగుటూరులో

టంగుటూరు: మండల కేంద్రంలోని గ్రంథాలయాన్ని ప్రకాశం జిల్లా గ్రంథాలయ సంస్థ కార్యదర్శి ఆదిలక్ష్మి ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆమె గ్రంథాలయంలోని పలు రికార్డులు పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. కార్యక్రమంలో గ్రంథపాలకుడు గుమ్మడి వర్ధన్‌రాజు పాల్గొన్నారు.

నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు



కొండపిలో పచ్చాకు కూలీలతో మాట్లాడుతున్న ఎస్సై



ఆటోడ్రైవర్లకు వివరిస్తున్న డీఎస్పీ సాయి ఈశ్వర్

పామూరు: నిబంధనలు అతిక్రమించి వాహనాలను నడిపితే ఉపేక్షించేదిలేదని.. కఠిన చర్యలు తీసుకుంటామని కనిగిరి డీఎస్పీ పీ సాయిఈశ్వర్ యశ్వంత్ పేర్కొన్నారు. స్థానిక సర్కిల్ కార్యాలయం ఆవరణలో గురువారం సీఐ ఎం.భీమానాయక్ అధ్యక్షతన రహదారి భద్రతలో భాగంగా ఆటో, ట్యాక్సీ, ట్రాక్టర్, ఇతర వాహన డ్రైవర్లకు నిబంధనలు, డ్రైవింగ్ సమయంలో అప్రమత్తతపై అవగాహన, కౌన్సెలింగ్ నిర్వహించారు. ప్రతి ఆటోడ్రైవర్ విధిగా యూనిఫాం ధరించాలన్నారు. మద్యం తాగి వాహనాలు నడిపినా, మైనర్లు వాహనాలు నడిపినా వాహనాలను సీజ్‌చేసి వారికి రు.25 వేలు జరిమానా విధిస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో ఎస్సై టి.కిషోర్‌బాబు, కార్మికసంఘం నాయకులు కొమ్మలపాటి మాల్యాద్రి, వాహన డ్రైవర్లు పాల్గొన్నారు.

కొండపి: వాహనదారులు తప్పనిసరిగా ప్రభుత్వ నిబంధనలను పాటించాలని, కొండపి సర్కిల్ ఇన్స్పెక్టర్ జి సోమశేఖర్ అన్నారు. మండల పరిధిలోని కొండపిలోని టంగుటూరు రహదారిలో వాహనాల తనిఖీ చేపట్టారు. కార్యక్రమంలో ఎస్సై ప్రేమ్ కుమార్, స్థానిక పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

పచ్చాకు ట్రాక్టర్లలో ప్రయాణించొద్దు

జరుగుమల్లి (సింగరాయకొండ): పొగాకు కూలీలు పచ్చాకు రవాణా చేసే ట్రాక్టర్లలో ప్రయాణించి ప్రమాదాల బారిన పడవద్దని ఎస్సై బీ మహేంద్ర సూచించారు. జరుగుమల్లి మండలంలోని పంగులూరివారిపాలెం, చిర్రికూరపాడులో గురువారం పొగాకు కూలీలకు ట్రాక్టర్ ప్రమాదాలపై ఆయన అవగాహన కల్పించారు. ఎస్సై మహేంద్ర మాట్లాడుతూ ఇటీవల కాలంలో పొగాకు పచ్చాకు రవాణా చేసే ట్రాక్టర్లలో కూలీలు ప్రయాణిస్తూ ప్రమాదాల బారినపడి మృత్యువాత పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఆ విధంగా ట్రాక్టర్లలో ప్రయాణిస్తే బ్యారన్ యజమానులపై కేసు నమోదు చేస్తామని హెచ్చరించారు. కావున కూలీలను ప్రత్యేకంగా ఆటోలో రవాణా చేయాలని సూచించారు. పచ్చాకు కూలీలు పాల్గొన్నారు.

టన్ను చిల్ల కర్ర రూ.4500



చిల్లకర్ర తరలిస్తున్న ట్రాక్టర్

హనుమంతునిపాడు: చిల్ల కర్ర ఈ ఏడాది మంచి గిరాకీ పలుకుతోంది. మండలం నుంచి రోజు భారీగా ఇతర మండలాలకు 20 ట్రక్కుల పేనే తరలిపోతోంది. ఈ ఏడాది పలికిన ధర గతంలో ఎప్పుడూ పలకలేదని రైతన్నలు చెప్తున్నారు. టన్ను కర్ర ధర రూ.4500 పెట్టి కొనుగోలు చేసి రైతులు కొనుగోలు చేసి తీసుకెళ్లుతున్నారు. కందుకూరు ప్రాంతాలకు పొగాకు బ్యారన్లకు భారీగా తరలుతోంది. మండలంలో 23 గ్రామ పంచాయతీలో 250 పైబడి పొగాకు బ్యారన్‌లు ఉన్నాయి. కుంటలు, చెరువులు, వాగులు, వంకలు, పొలం గట్ల పక్కన, బీడు భూములో ఈ కర్ర భారీగా పెరిగి ఉంది. ఈప్రాంతంలో చిల్లకర్ర ఎక్కువగా దొరుకుతుంది. బొగ్గు బట్టీలు కూడా ఉన్నాయి. బొగ్గు పట్టి నిర్వాహకులు కూలీల వద్ద నుంచి రూ 2 వేల నుంచి రూ.3 వేలు మించి ధర పెట్టి కొనుగోలు చేయ లేదు. ప్రస్తుతం పొగాకు సీజన్ కావడంతో రైతులు బ్యారన్ పొగాకు కాల్పుకు ఎక్కువ ధర పెట్టి కొనుగోల్‌లో చేసి తరలిస్తున్నారు.

జాగ్రత్తలతో కుష్టువ్యాధి నిర్మూలన



చెన్నిపాడులో కుష్టు వ్యాధిపై అవగాహన కల్పిస్తున్న ఆరోగ్య సిబ్బంది

పొన్నలూరు: గ్రామాల్లో కుష్టు వ్యాధి నిర్మూలనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పీహెచ్‌సీ వైద్యులు కృష్ణచైతన్య, రవికిరణ్ అన్నారు. జాతీయ కుష్టు వ్యాధి నివారణ సర్వేలో భాగంగా గురువారం స్థానిక పీహెచ్‌సీ సిబ్బంది, ఆశా కార్యకర్తలకు మండలంలోని అన్ని పంచాయతీల్లో కుష్టు వ్యాధిపై అవగాహన కల్పిస్తూ సర్వే చేపట్టారు. ఈ సందర్భంగా పీహెచ్‌సీ డాక్టర్లు మాట్లాడుతూ జాతీయ కుష్టు వ్యాధి నిర్మూలన కార్యక్రమంలో భాగంగా వచ్చే నెల 2 వరకు కుష్టు వ్యాధిపై ప్రజలకు అవగహన కల్పిస్తామన్నారు. చర్మపై స్పర్శ లేకపోవడం, నొప్పి, దురదలేని మచ్చలు, చర్మంపై రాగిరంగు మచ్చలు, చేతులు, పాదాలు తిమ్మిర్లగా ఉండటంత కుష్టు వ్యాధి లక్షణాలన్నారు. ఇంటింటికి సర్వే చేపట్టి అనుమానిత లక్షణాలు ఉన్న వారిని గుర్తిస్తామన్నారు. కార్యక్రమంలో ఆరోగ్య సిబ్బంది, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

హనుమంతునిపాడు: మండలంలోని లింగంగుంట్లలో వైద్యాధికారి దార్ల సందీప్‌కుమార్ కుష్టు వ్యాధి సర్వేను పరిశీలించి సిబ్బందికి సూచనలు చేశారు.

ఫ్లోరోసిస్‌పై అప్రమత్తంగా ఉండాలి




విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న వైద్య సిబ్బంది

పీసీపల్లి: ఫ్లోరోసిస్ వ్యాధిపై అప్రమత్తంగా ఉండాలని డాక్టర్ అనిల్ పేర్కొన్నారు. జాతీయ ఫ్లోరోసిస్ నియంత్రణ కార్యక్రమంలో భాగంగా మండల పరిధిలోని దివాకర్‌పురం, మురుగమ్మి గ్రామాల్లో మండల ప్రాథమిక ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు, విటమిన్ సీ, కాల్షియం, ప్రాముఖ్యతపై ప్రజలకు అవగాహన కల్పించారు. వ్యాధి బారినపడి ఇబ్బంది పడే వారికి ప్రభుత్వం తరపున ప్రోత్సాహకం అందజేస్తామన్నారు. కార్యక్రమంలో డాక్టర్ మంజుల, సూపర్వైజర్ రేణుక దేవి, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

నేతాజీ ఆశయాలు అనుసరణీయం



నర్రమారెళ్లలో చంద్రబోస్‌కు నివాళులర్పిస్తున్న విద్యార్థులు



కనిగిరిలో నివాళులర్పిస్తున్న విద్యార్థినులు

పామూరు: నేతాజీ ఆశయాలు అనుసరణీయమని ఉపాధ్యాయులు పేర్కొన్నారు. మండలంలోని నర్రమారెళ్ల ప్రభుత్వ ప్రాథమికోన్నత పాఠశాలలో గురువారం నేతాజీ సుభాష్ చంద్రబోస్ జయంతి వేడుకలు నిర్వహించారు. ఈసందర్భంగా నేతాజీ చిత్రపటానికి పూలమాలవేసి ఘనంగా నివాళులర్పించారు. హెచ్‌ఎం షేక్.మహబూబ్‌బాషా మాట్లాడుతూ ఆంగ్లేయులపైకి దూసుకొచ్చిన ఓ బుల్లెట్ నేతాజీ సుభాష్ చంద్రబోస్ అన్నారు. ఆంగ్లేయుల చెర నుంచి తదేశాన్ని విముక్తి చేసేందుకు సైనిక రీతిన పోరాడిన సమరయోధుడు చంద్రబోస్ అన్నారు. కార్యక్రమంలో తోట రమేష్, నెల్లూరు నీరజ, సుజాత, వెంకటేశ్వర్లు, కోటేశ్వరరావు, ఎస్.వి.ప్రసాద్, డి.నాగేశ్వరరావు, విద్యార్థులు పాల్గొన్నారు.

కనిగిరి రూరల్: నేతాజీ సుభాష్ చంద్రబోస్ జయంతి వేడుకలను కనిగిరిలో ఘనంగా నిర్వహించారు. స్థానిక వైష్ణవీ మహిళా డిగ్రీ కళాశాలలో నేతాజీ సుభాష్ చంద్రబోస్ చిత్రపటానికి పూల మాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం జరిగిన కార్యక్రమంలో ప్రిన్సిపాల్ ఎన్ వెంకటేశ్వర్లు మాట్లాడుతూ చంద్రబోస్ జీవితం అందరికి స్ఫూర్తి దాయమన్నారు. కార్యక్రమంలో అధ్యాపకులు సాయిరాం, హరినాయణ, హనోక్ కుమార్, మస్తాన్, అనీల్, వెంకటయ్య, రాజా, తదితరులు పాల్గొన్నారు.

నారసింహుడికి మంచుతెరల పూజలు



మంచుదుప్పట్లో శింగర చెరువు

సింగరాయకొండ: ఓ దశావతార.. పాహిమాం.. నమోస్తుతే అందుకో మా పూజలు అంటూ మంచు తెరలు స్వామివారికి పూజలు చేశాయి. మండలంలోని పాతసింగరాయకొండలో గురువారం మంచు దుప్పటి పరచుకుంది. వరాహ లక్ష్మీ నరసింహస్వామి దేవస్థాన కొండపై నుంచి చూస్తే ఎదురుగా శింగర చెరువు, పచ్చటి పొలాలు, తోటలు మంచు దుప్పట్లో సర్వాంగ సుందరంగా కన్పించి చూపరులను ఆకట్టుకున్నాయి.